
జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


కొల్లాపూర్‌లో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు


కోడేరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు


ఈగలపెంట డీఏవీ పాఠశాలలో..


లింగాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఓటుహక్కు విలువైంది

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రాధాన్యతను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓటు హక్కుపై ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

– సాక్షి, నెట్‌వర్క్


అచ్చంపేటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ పాండునాయక్


అమ్రాబాద్‌లో..


పెంట్లవెల్లిలో ప్రతిజ్ఞ..


కల్వకుర్తిలో మొక్కకు నీరు పోస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్


తాడూరులో..


బిజినేపల్లి మండలం పాలెంలో..


పెద్దకొత్తపల్లిలో..


ఉప్పునుంతల పాఠశాలలో..


తెలకపల్లిలో..


వెల్దండలోని తహసీల్దార్ కార్యాలయంలో..

క్లుప్తంగా

ఆకృతి సుధాకర్ ఉదారత అభినందనీయం



కందనూలు: పుట్టిన ఊరిని మరచిపోకుండా.. చదువుకున్న పాఠశాలలో మెరిట్ సాధించిన విద్యార్థులకు 17ఏళ్లుగా స్కాలర్‌షిప్ ఇస్తున్న ప్రముఖ కళా సంస్థ ఆకృతి అధ్యక్షుడు, శ్రీపురం గ్రామవాసి ఆకృతి సుధాకర్‌ను జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌తో పాటు ఎస్పీ మనోహర్ అభినందించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శ్రీపురం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో 9.7 గ్రేడ్ మార్కులతో మొదటి ర్యాంక్ సాధించిన రాజోజు, మౌనికకు రూ.5వేల నగదు, రెండో ర్యాంక్ సాధించిన కల్పనకు రూ.3వేలు నగదుతో పాటు శాలువా, ప్రశంసాపత్రం ఆకృతి సుధాకర్ ఆధ్వర్యంలో కలెక్టర్ అందజేసి ప్రశంసించారు. మొదటి ర్యాంక్‌కు ఆకృతి సుధాకర్ స్కాలర్‌షిప్ ఇవ్వగా, రెండో ర్యాంక్‌కు ఆయన సోదరుడు పి.రామ్మోహన్ రావు స్కాలర్‌షిప్ అందించారు. అనంతరం ఎస్పీ మనోహర్ విద్యార్థులను, నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పి.రాంకిషన్ రావు, పి.రఘునందన్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

పెంట్లవెల్లి: గణతంత్ర వేడుకల సందర్భంగా మండల కేంద్రంలో పాఠశాలలు, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్పత్రి, పలు కార్యాలయాలు విద్యుద్దీపాలు, త్రివర్ణ రంగులతో ముస్తాబు అయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు.

రుణాలు ఇవ్వాలి

అచ్చంపేట రూరల్: మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్‌ఎస్ మైనార్టీ జిల్లా నాయకుడు షేక్ ఖలీల్ అన్నారు. బుధవారం అచ్చంపేట ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న పేద మైనార్టీలందరికీ రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజును ఈ విషయమై విన్నవించామని, సానుకూలంగా స్పందించారని తెలిపారు.

శాంతిభద్రతలపై అవగాహన

అమ్రాబాద్: ప్రజలందరి భాగస్వామ్యంతోనే నేరాల నిర్మూలన సాధ్యమని, శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్ సూచించారు. అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కుమ్మరోనిపల్లిలో అవగాహన సమావేశం నిర్వహించారు. కానిస్టేబుల్ భాస్కర్, వీరయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని కొట్రలో గ్రామసేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం బాధిత కుటుంబానికి ఆర్థికసాయంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. గ్రామానికి చెందిన దద్దుకు రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని గ్రామ సేవా సమితి అధ్యక్షుడు రవీందర్‌రావు పరామర్శించి నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సమితి సభ్యులు రవీందర్‌యాదవ్, స్వామి, మల్లేష్, వెంకటయ్య, అర్జున్, వీరేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించండి

అమ్రాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్ యూటీఎఫ్ మద్దతు ఇస్తున్న అభ్యర్థి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని సంఘం రాష్ట్ర నాయకుడు కొర్రశంకర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కేంద్ర ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి మాట్లాడారు.

పదోన్నతులు కల్పించాలి

లింగాల: పండిత పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని, 317 జీఓ బాధితులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని బుధవారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ మునిరొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.

విత్తనాలు పంపిణీ

లింగాల: మండలంలోని శాయిన్‌పేటలో బుధవారం కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 43మంది రైతులకు మేలు రకమైన రెండు రకాల పశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేశారు.

బీజేపీ వైఖరి ప్రకటించాలి

కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ అంశంపై బీజేపీ తన వైఖరిని అధికారికంగా ప్రకటించాలని బీఆర్‌ఎస్ ఎస్సీ విభాగం నాయకుడు దేవని కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సున్నపుతండా, బోడబండ తండాల్లో కొల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు, పాలమూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

విద్యార్థుల రాస్తారోకో

అచ్చంపేట రూరల్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బీజేవైఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అనాథలకు అండగా నిలవాలి



నాగర్‌కర్నూల్ క్రైం: అనాథలను చిన్నచూపు చూడకుండా వారి ఎదుగుదలకు ప్రోత్సహించాలని డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ అన్నారు. బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనాథ చిన్నారులకు బుధవారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు ఫంక్షన్‌హాల్‌లో పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ హాజరై మాట్లాడారు. బాలవికాస సంస్థ సభ్యులు చేస్తున్న సేవలు ఆదర్శమని, అనాథల పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం గొప్ప విషయమని అన్నా రు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కల్పన, రెడ్‌క్రాస్ సెక్రటరీ సి.రమేష్‌రెడ్డి, బాలవికాస సంస్థ సభ్యులు శోభ, కల్యాణి, రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయండి

నాగర్‌కర్నూల్ రూరల్: 2022–23 ఆర్థిక సంవత్సరానికి దళితబంధు పథకం అమలు కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.17,700 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. బుధవారం ఉయ్యాలవాడలోని బుడగజంగాల కాలనీలో దళితబంధు పథకంపై అవగాహన కల్పించారు. కార్పొరేషన్ ద్వారా ఇవ్వాల్సిన నిధులను ఇవ్వాలని, లేనిపక్షంలో ఈనెల 27న కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని తెలిపారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లిలో ధ్వజస్తంభం, పోచమ్మ, బొడ్రాయిలను బుధవారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోజ్యానాయక్, సర్పంచ్ కొమ్మురాజు, కాంగ్రెస్ నాయకులు జగదీశ్వరావు పూజలు చేశారు.

ల్యాప్‌టాప్‌లు అందజేత



కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని జేపీనగర్ పాఠశాలలోని సీఓఈ కేంద్రంలో చదివి ఐఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా రూ.50వేల నగదుతో పాటు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. హైదరాబాద్‌లో గురుకులాల సొసైటీ కార్యాలయంలో కార్యదర్శి రొనాల్డ్‌రోస్‌తో కలిసి విద్యార్థులకు మంత్రి అందించారు. పాఠశాలలో చదివిన విద్యార్థులలో 2021 విద్యా సంవత్సరంలో అణ్వేష్ ఐఐటీ మద్రాస్, దేవరాజు ఎన్‌ఐటీ వరంగల్, వెంకటేష్ ఐఐటీ వడోదరలో సీట్లు సాధించారు.

దళితరత్న అవార్డు..

కల్వకుర్తిరూరల్: పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ రాంపర్వతాలుకు రాష్ట్ర సంక్షేమ శాఖమంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం దళితరత్న అవార్డును అందించడంతో పాటు శాలువాతో సత్కరించారు. 25ఏళ్లుగా రాంపర్వతాలు కల్వకుర్తి ప్రాంతంలో దళితుల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వ పథకాలను మంజూరు చేశారు. ఆయన సేవలను గుర్తించి అవార్డును అందించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

అమ్రాబాద్: కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రాజ్‌గోపాల్ ఆధ్వర్యంలో మండలంలోని చింతలోనిపల్లికి ఆలేటి రాజు, చింతల మల్లేష్, రాములు, అశోక్ తదితరులు బుధవారం డీసీసీ అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

యాత్రను విజయవంతం చేయాలి..

చారకొండ: మండలం నుంచి ప్రారంభం అవుతున్నా అభియాన్ యాత్రను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు.


యువకులకు కాంగ్రెస్ కండువా కప్పుతున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వెంకట్‌గౌడ్, బాల్‌రాంగౌడ్ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి


తాడూరులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తాడూరు: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం మండల కేంద్రంతో పాటు గుంతకోడూరులో కొనసాగుతుంది. బుధవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, సింగిల్ విండో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు బచ్చిరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, జైపాల్‌రెడ్డిలు పరీక్షలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఇస్మాయిల్, సిబ్బంది శ్రీనివాసులు, సునిత, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. 5వ రోజు 190 మంది చికిత్సకు వచ్చారని, అందులో 30మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా అధికారి ఆప్తామాలిజిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, శోభారాణి, మంజుల పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అంబట్‌పల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కంటి వెలుగు ద్వారా కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారులు బిక్కునాయక్, సంతోష్ ఆధ్వర్యంలో కంటి వెలుగు ద్వారా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలను అందజేస్తున్నారు.

బీరప్ప ఉత్సవాలు

తాడూరు: మండలంలోని గుంతకోడూరులో నాలుగు రోజుల పాటు నిర్వహించే బీరప్ప ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బీరప్ప ఆలయంలో బండారు కార్యక్రమం ప్రారంభించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రతి యేటా ఉత్సవాలను నిర్వహిస్తామని, అందులో భాగంగా బుధవారం ఉత్సవాలను బండారు కార్యక్రమంతో ప్రారంభించామని ఉత్సవాల నిర్వాహకులు పర్వతాలు, శ్రీశైలం, కురుమయ్య, వెంకటయ్య తదితరులు తెలిపారు.


పూజల్లో పాల్గొన్న మహిళలు

విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వం


భోజనాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ మోహన్‌బాబు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థుల నిరసనపై డీఎస్‌ఓ మోహన్‌బాబు విచారణ చేపట్టారు. బుధవారం పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్థులకు వడ్డిస్తున్న బియ్యాన్ని, వండే పద్ధతిని పరిశీలించారు. అనంతరం బియ్యాన్ని రెండు శాంపిళ్లుగా తీసుకొని వెళ్తున్నామని, వాటిని పరిశీలిస్తామన్నారు. బియ్యం సంచులపై ఉన్న ట్యాగ్‌లను పరిశీలించిన డీఎస్‌ఓ వీటిని నిజామాబాద్ నుంచి ఇక్కడకు పంపించారని గుర్తించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు. అనంతరం పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ సత్యం, ఎంపీపీ మనోహర, వైస్ ఎంపీపీ గోవర్ధన్, ఎంఈఓ బాసునాయక్, ఇతర అధికారులంతా కలిసి విద్యార్థులతో పాటుగా మధ్యాహ్న భోజనం చేశారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

తాడూరు: అందరి సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని ఎంపీడీఓ గంగామోహన్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల వారిగా సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచేందుకు ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు సహకరించాలని మండల వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌అభిరాం సభ్యులను కోరారు. ప్రజాప్రతినిధులు సహకరిస్తే పేద ప్రజలకు వైద్య సదుపాయాల కోసం ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వర్తిస్తాయని అన్నారు. మండలంలోని అల్లాపూర్‌లో చెక్‌డ్యాం నిర్వహణ సరిగా లేకపోవడంతో ధ్వంసం చేసి పంటసాగు చేసుకుంటున్నారని, అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టాలని ఎంపీటీసీ కరుణాకర్ సభ దష్టికి తీసుకువచ్చారు. తిరుమలాపూర్‌లో గత సమావేశంలో సభ్యులు సూచించిన విద్యుత్ సమస్యలను పరిష్కరించామని ఏఈ చెంతన్‌తేజ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై నిఘా పెంచాలని, పిల్లల ఎదుగుదలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం దుర్వినియోగం కాకుండా చూడాలని సిర్సవాడ ఎంపీటీసీ రమేష్‌రెడ్డి సూపర్‌వైజర్ వనజకు సూచించారు. అనంతరం సభలో ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో ఎంపీడీఓ గంగామోహన్, తహసీల్దార్ కార్తీక్, వైస్ ఎంపీపీ శివలీల, డీఎల్‌పీఓ రామ్మోహన్, తహసీల్దార్ కార్తీక్, సూపరింటెండెంట్ ఆంజనేయులు, సింగిల్‌విండో చైర్మన్ సమ్మద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ గంగామోహన్

బకాయిలు చెల్లించండి

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని ప్రజలతో పాటు, విలీన గ్రామాల ప్రజలు విధిగా వారి ఆస్తిపన్నును గడువులోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని కుళాయి బిల్లులు, అడ్వర్‌టైజ్‌మెంట్ ఫీజులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులను మార్చి 31వ తేదీలోపు చెల్లించాలని కోరారు. మున్సిపాలిటీలో దుకాణాలు నిర్వహించే వారు కొత్తగా దరఖాస్తు చేసుకున్న ట్రేడ్ లైసెన్స్‌లను విధిగా కార్యాలయంలో పొందాలన్నారు. సెలవు రోజుల్లో కూడా బకాయిలు చెల్లించేందుకు అవకాశాన్ని ఏర్పాటు చేశామని, పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. బకాయిలను చెల్లించని వారిపై మున్సిపల్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేటి నుంచి గంధోత్సవం

అమ్రాబాద్: పదర మండలంలోని వంకేశ్వరంలో వెలిసిన సైదులు బాబా గంధోత్సవం గురువారం నుంచి శుక్రవారం వరకు రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అనిత, తిరుపతయ్య, ఉష, వరుణ్ తెలిపారు.

విడుదల చేయండి

అచ్చంపేట రూరల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అక్రమంగా అరెస్టు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులను విడుదల చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సోట కాశీం మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం అచ్చంపేటలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు.

టై, బెల్టులు పంపిణీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్లలో సర్పంచ్ జ్యోతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టై, బెల్టు, బ్యాడ్జీలు జెడ్పీటీసీ జూపల్లి భాగ్యమ్మతో కలిసి బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు.

వాహనాల పట్టివేత

బిజినేపల్లి: మండల కేంద్రంలో పలుగుతిప్ప వద్ద అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర వాహనాన్ని, ప్రొక్లేయిన్ యంత్రాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఎస్‌ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి టిప్పర్, హిటాచీపై కేసు నమోదు చేసి చర్యల కోసం బుధవారం తహసీల్దార్ అంజిరెడ్డికి బదిలీ చేశారు. తహసీల్దారు అంజిరెడ్డి మాట్లాడుతూ ఈ కేసును మైనింగ్ ఏడీకి బదిలీ చేస్తున్నట్లు తెలిపారు.

సాగునీరు విడుదల చేయండి

పెంట్లవెల్లి: జూరాల చివరి ఆయకట్టుకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ హనుమంతుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఈశ్వర్ మాట్లాడుతూ జూరాల చివరి ఆయకట్టు డి–36 కాల్వకు నీళ్ల లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలపారు. పెంట్లవెల్లి మండలంలోని జటప్రోల్, గోపులాపురం, సింగవరం, కొండూరు గ్రామాల రైతులకు నీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వెంటనే జూరాల నుంచి సాగునీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో కురుమయ్య, ఎల్లగౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు

డైరీ ఆవిష్కరణ

దోమలపెంట(అచ్చంపేట): రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం డైరీ, క్యాలెండర్‌ను బుధవారం భూగర్భ జల కేంద్రం సీఈ సుర్యనారాయణ, ఎస్‌ఈ (ఓఅండ్‌ఎం) ఆదినారాయణ, ఎస్‌ఈ (సివిల్)రవీంద్రకుమార్ చేతుల మీదుగా ఈగలపెంటలో సంఘం రాష్ట్ర నాయకులు రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రీజియన్ నాయకులు రాము, రామయోగయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.